క్లుప్తంగా

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



గోకుల తిరుమల పారిజాతగిరిలో నిర్వహిస్తున్న శాంతి కల్యాణం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తోన్న పవిత్రోత్సవ కార్యక్రమాలు సోమవారం పూర్ణాహుతి, శాంతి కల్యాణ మహోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఆలయంలో విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అనంతరం యాగశాలలో హోమం, అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. దేవతామూర్తులకు పవిత్ర అవరోహణ గావించి పవిత్రాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాసునికి శాంతి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా పావని



డి.పావని

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్‌గా డి.పావని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి నగర పాలక సంస్థలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆమె ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు పని చేసిన ప్రసాద్ రాజు యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ పావని మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పీజీఆర్ఎస్‌లో 15 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 15 అర్జీలు వచ్చాయని ఆర్డీఓ తెలిపారు. వీటిలో భూసంబంధిత సమస్యలు, పింఛన్‌లు తదితర సమస్యలపై వినతులు అందినట్టు పేర్కొన్నారు. వినుతులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించి తేదీగాలోగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

పెండింగ్ జీతాల విడుదల కోరుతూ వినతి

బుట్టాయగూడెం: పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇప్పించాలని కోరుతూ జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిబాబాకు వెలుగు వీఓఏలు సోమవారం బుట్టాయగూడెంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏ సంఘ నాయకురాలు వాగ్దేవి మాట్లాడుతూ తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని అన్నారు. 8 నెలలు జీతాల బకాయిలను ఇప్పించేవిధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కట్టూరి మంగ, అందుగుల సుగుణారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి మృతి



ప్రసాద్ రెడ్డి (ఫైల్)

టి.నరసాపురం: ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ గాది రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ఆకస్మిక మృతి పార్టీకి తీరనిలోటని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీనురాజు, జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్య నారాయణ రాజులు అన్నారు. వల్లంపట్ల పంచాయతీ మల్లుకుంటకు చెందిన రాజేంద్రప్రసాద్ రెడ్డి గుండెపోటుతో సోమవారం సాయంత్రం మృతి చెందినట్టు వారు తెలిపారు. పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. తుమ్మూరు శ్రీనివాస్ రెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చైన్ స్నాచింగ్‌పై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళ మెడలో నుంచి గొలుసును చోరీ చేసిన ఘటన జంగారెడ్డిగూడెంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేగవరానికి చెందిన మాదాసు సిద్దాయమ్మ పట్టణంలోని త్రివేణి కళాశాల సమీపంలో ఉన్న రెండో కుమార్తె ఇంటికి తన చిన్న కూతురుతో కలిసి వచ్చింది. తిరిగి వేగవరం వెళ్లేందుకు ఆటో కోసం స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో కూతురుతో కలిసి సిద్దాయమ్మ నడుచుకుంటూ వెళుతోంది. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి సిద్దాయమ్మ మెడలోని బంగారపు నల్లపూసల తాడును తెంచుకుని పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న సీఐ కృష్ణబాబు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఇనుప పిల్లర్ బాక్సులు దొంగతనం చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జబీర్ తెలిపారు. స్థానిక బాటగంగానమ్మ గుడి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, ఆటోలో ఇనుప పిల్లర్ బాక్సులు చోరీ చేసి వెళుతుండగాన్ని పట్టుకున్నామన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి ఇనుప పిల్లర్ బాక్సులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

లేఅవుట్లపై విచారణకు డిమాండ్

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం
- పలు అభివృద్ధి పనులకు ఆమోదం





మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (అంతర చిత్రం)

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ అధికారుల పనితీరుపై కౌన్సిలర్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణపరిధిలో సర్వే నెంబర్ 359లో వేసిన లేఅవుట్లను రెగ్యులర్ చేసేందుకు అధికారులు అజెండాలోని 27వ అంశంగా పేర్కొన్నారు. దీనిపై వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, దొంగు మాధవ, ఏపీ రమణమూర్తి, సంకు సురేష్ తదితరులు మాట్లాడుతూ సర్వే నెం.359లోని 9.40 ఎకరాల భూమిని రెండు భాగాలు చేసి ఒక రియల్టర్ 2007లో లేఅవుట్ వేసినట్టు తెలిపారు. ఇవి నిబంధనల మేరకు లేకపోవడంతో అధికారులు బిల్డింగ్ అనుమతులు నిరాకరిస్తున్నారని చెప్పారు. సామాజిక ప్రయోజనాల కోసం మున్సిపాలిటీకి 10 శాతం అంటే 94 సెంట్లు అప్పట్లో కేటాయించి, అనంతరం రియల్టర్ తిరిగి స్వాధీనం చేసుకున్నారని వివరించారు. మున్సిపాలిటీకి చెందాల్సిన ఈ 94 సెంట్ల భూమి విలువ రూ.3 కోట్లకుపైగా ఉంటుందని, దానిని కేటాయించకుండా ఎలా రెగ్యులర్ చేస్తారని ప్రశ్నించారు. ఈ లేఅవుట్లపై విజిలెన్స్, ఏసీబీ అధికారులతో విచారణ చేయించాలని మున్సిపల్ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎస్ నరేంద్రకుమార్‌కు, చైర్ పర్సన్ బత్తిన లక్ష్మికి ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఇటువంటి లేఅవుట్లన్నింటిపైనా విజిలెన్స్, ఏసీబీ విచారణ చేయించి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్, చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మిలు హామీ ఇచ్చారు.

పనులు పూర్తికాకపోవడంపై ఆగ్రహం

వైస్ చైర్మన్లు అంజి, వాసవీ రత్నం, పీపీఎస్ చంద్రరావు, చిటికెల అచ్చిరాజు, కె.రమాదేవి, వలవల తాతాజీ తదితరులు మాట్లాడుతూ గతంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేసి టెండర్లు పిలిచినా పనులు పూర్తికావకపోవడంపై అధికారులను నిలదీశారు. టెండర్ వేసిన కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని, ఆ పనులు పూర్తికాకుండా కొత్త పనులు ఎందుకు అజెండాలో పెడుతున్నారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌లకు బిల్లులు చేయకపోవడంతో పనులు చేయలేకపోతున్నామని చెబుతున్నా అధికారులు ఎందుకు స్పందించరని నిలదీశారు. పట్టణంలో శానిటేషన్ దారుణంగా ఉందని, కొన్ని వార్డుల్లో అభివృద్ధి పనులే పెట్టేడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇసుక సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. పట్టణంలో డ్రెయిన్లలో పూడిక తీత చేపట్టాలని, స్ట్రీట్ లైట్‌లు సక్రమంగా వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని, ఇసుక సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ నరేంద్రకుమార్ హామీ ఇచ్చారు. పట్టణంలో సీసీ డ్రెయిన్లు, సీసీ కల్వర్టులు, బోర్‌లు, సీసీ రోడ్లు, హెచ్‌డీపీఈ పైప్‌లైన్ల ఏర్పాటుకు అజెండాలోని అంశాలను ఆమోదించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణమయ పథకానికి రూ.1.25 లక్షల విరాళం



దాత సుబ్బరాజు కుటుంబానికి విరాళం బాండ్ పత్రం అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ విమానగోపుర స్వర్ణమయ పథకానికి భీమడోలుకు చెందిన సుబ్బరాజు సోమవారం రూ.1,25,000లను విరాళంగా అందించారు. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. విరాళం సొమ్మును ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ధర్మాజీగూడెం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

లింగపాలెం: ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆదివారం పర్యటనలు ముగించుకుని వస్తున్న సమయంలో ధర్మాజీగూడెం ఆసుపత్రిని మరోసారి తనిఖీ చేశారు. సిబ్బందితో సెక్యూరిటీ విషయంపై ఆరా తీశారు. ఆసుపత్రిలో సీసీ కెమేరాల పని తీరును పరిశీలించి, ప్రవేశ ద్వారా వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని అన్నారు. ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కుల రహిత సమాజానికి పాటుపడదాం

వేలేరుపాడు: పనిని బట్టి, కులాలు పుట్టుకొచ్చాయని, కులరహిత సమాజం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే గౌస్ అన్నారు. బండలబోరు గ్రామంలో సోమవారం జిల్లా నాయకులు సిరికొండ రామారావు అధ్యక్షతన నిర్వహించిన కుల నిర్మూలన సదస్సులో గౌస్ మాట్లాడారు. నేటి పాలకవర్గాలు కుల సమస్యతో రాజకీయాలు చేస్తున్నారని, మతోన్మాదం పేరుతో ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, బి.సత్యనారాయణ మాట్లాడారు. నాయకులు కె.వీరస్వామి, కె.సత్యవతి, ఎస్‌కే మున్ని, మడివి కన్నమ్మ, మేడే పల్లి సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి దేవీ శరన్నవరాత్రులు

కొయ్యలగూడెం: దేవీ శరన్నవరాత్రులు ఈ నెల 3 తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కొయ్యలగూడెంలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ నూతన ఆలయం ఉత్సవాలకు తుది మెరుగులు దిద్దుకుంటోంది. బయ్యనగూడెంలోని కనకదుర్గ మ్మ, వై.జంక్షన్, కన్నాపురం, గవరవరం, రాజవరం, అచ్యుతాపురంలలోని అమ్మవారు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. రాజవరంలో ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి శరన్నవరాత్రుల్లో పూజించనున్నారు. భక్తులు భవానీల మాలాధారణ చేసి అమ్మవారిని కొలిచేందుకు సిద్ధమవుతున్నారు.

గురవాయిగూడెంలో ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం అయ్యప్పక్షేత్రంలో ఉపాలయమైన శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 3న బాలా త్రిపుర సుందరి, 4న శ్రీగౌరీ దేవి, 5న శ్రీగాయత్రి దేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి, 8న శ్రీ మహాలక్ష్మీ దేవి, 9న శ్రీ మహా సరస్వతీ అమ్మవారు, 10న శ్రీమహా దుర్గాదేవి, 11న శ్రీ మహిషాసురమర్దిని, 12న విజయ దశమి సందర్భంగా శ్రీరాజ రాజేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. దసరా నుంచి స్వాములు, భవానీలకు భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి 45 రోజుల పాటు నిర్వహిస్తామని అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

మారని అధికారుల తీరు!



నిత్యం తాళం వేసి ఉంటున్న వేలేరుపాడు ఎంపీడీఓ కార్యాలయ గది



వేలేరుపాడు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

- తాళం వేసిఉన్న ఎంపీడీఓ కార్యాలయం
- విధులకు ఎంపీడీఓ గైర్హాజరు
- పనుల కోసం ప్రజల పడిగాపులు

వేలేరుపాడు: వేలేరుపాడు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే అధికారుల తీరు మారడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నిత్యం విధులకు డుమ్మా కొడుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయిందని వాపోతున్నారు. అక్టోబర్ ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ నేపథ్యంలో విధుల్లో ఉండాల్సిన ఎండీపీఓ సోమవారం విధులకు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రమైన ఏలూరు జెడ్పీ కార్యాలయంలో సమావేశం పేరిట విధులకు హాజరు కాలేదు. వేలేరుపాడు మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలోని కొయిదా, కాచారం, పూసుగొంది, తాళ్లగొంది తదితర గ్రామాల నుంచి వివిధ పనుల కోసం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ప్రజలు కార్యాలయంలో అధికారులెవ్వరూ అందుబాటులో లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. దీనిపై 'సాక్షి' జెడ్పీసీఈఓ సుబ్బారావును వివరణ కోరగా, సోమవారం తమ కార్యాలయంలో ఎంపీడీఓలకు ఎలాంటి మీటింగ్‌లు లేవని తెలిపారు.

పట్టించుకునేవారేరీ?

వేలేరుపాడు మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లో అక్టోబర్ ఒకటో తేదీన 3194 మంది లబ్ధిదారులకు పింఛన్లు రూ.1,32,98,000 పంపిణీ చేయాల్సుంది. గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాల్సిన ఎంపీడీఓ సోమవారం విధులకు హాజరు కాలేదంటే ఎంత నిర్లక్ష్యమో అర్థంచేసుకోవచ్చు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సోమవారం ఉదయం 11 గంటలకు విధులకు హాజరై, ఆ తర్వాత వెళ్లిపోయారు. ప్రతి నిత్యం ఎంపీడీఓ, సీనియర్ అసిస్టెంట్ విధులకు గైర్హాజర్ అవుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదనే ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి

బ్యాంక్ ఎదుట రైతుల ఆందోళన



బూర్గంపాడులో ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న నిర్వాసిత రైతులు

కుక్కునూరు: ఒకసారి తీసుకున్న రుణానికి బ్యాంక్ అధికారులు రెండుసార్లు రికవరీ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన బాధిత రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో బ్యాంక్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ నిర్వాసితుల త్యాగాల పట్ల వారికి రుణమాఫీ చేసి ఆదుకోవాల్సిందిపోయి ఒకసారి తీసుకున్న రుణానికి రెండుసార్లు రికవరీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఘటనపై వెంటనే తగు విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పేరాల శ్రీనివాసరావు, ఎస్ సుబ్బారెడ్డి, మద్దిబోయిన వెంకట్రావు, భాగం శ్రీనివాసరావు, మేడిపల్లి వెంకటరమణ, కారేపల్లి శ్రీనివాస్‌రావు, సోముల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలి



కమిషనర్ పావనికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

చింతలపూడి: జీఓ 36 ప్రకారం నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రూ.21 వేలు జీతం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు తుర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన నగర కమిషనర్ డి.పావనిని మున్సిపల్ వర్కర్స్ మర్యాదపూర్వకంగా ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. జనవరిలో మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా నాటి ప్రభుత్వం జీఓ 36 జారీ చేసి, జీతం రూ.21 వేలు చేసిందని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌కు రూ.24,500 నిర్ణయించారని, ఇది మే నెల నుంచి చింతలపూడి నగర పంచాయతీ మినహా అన్ని మున్సిపల్ నగర పంచాయతీల్లో అమలవుతుందని వివరించారు. సంక్రాంతి బోనస్ రూ.1000 ఇవ్వాలని జీఓ 12 ఉండగా ఇప్పటికీ ఇవ్వలేదని, నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయిన దగ్గర నుంచి ఇప్పటివరకు ఏరియర్స్ ఒక్కొక్క కార్మికుడికీ రూ.2.23 లక్షలు రావాల్సి ఉందని తెలిపారు. వీటిని తక్షణం విడుదల చేయాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వెలగాడు అనురాధ, వడిత్య బాలు, శ్రీరాముల వెంకటయ్య, శ్రీరాముల కోటయ్య, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్లు అందజేత



విజయవాడ వరద బాధితులు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: విజయవాడ వరద బాధితులు 550 కుటుంబాలకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దుస్తులు, నిత్యావసర వస్తువుల కిట్లను అందజేశామని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆదివాసీలు, రైతులు, కార్మికులు, ఉపాధ్యాయులు కలిసి రూ.2.80 లక్షలు వసూలు చేసి విజయవాడ నగర కమిటీకి ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వసూలైన డబ్బుతో చీరలు, దుప్పటి నిత్యావసర సరుకుల కిట్లను ఒక్కొక్కటి రూ.2 వేలుపైగా ఖరీదైన సామగ్రిని బాధితులకు అందించామని తెలిపారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అనుబంధ ప్రజా సంఘాలు, ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయు, పీడీఎస్‌యు, పీఓడబ్ల్యూ సంఘాల నాయకులు పాల్గొన్నారని తెలిపారు.

గిరిజనులకు భూములు కేటాయించాలని ధర్నా



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బుట్టాయగూడెం: సింగరేణి సంస్థకు అప్పగించిన రిజర్వ్, అన్‌రిజర్వ్ భూములను స్థానిక గిరిజనులకే కేటాయించాలని కోరుతూ కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద సోమవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎమ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కోరండ్ల శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రామ్మోహన్‌లు మాట్లాడుతూ 14 సంవత్సరాల క్రితం సింగరేణి సంస్థ తెలంగాణలో ఫారెస్ట్ భూములను తీసుకున్నట్టు చెప్పారు. ఆ భూములకు వంతుగా బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో ఉన్న సరిహద్దుల్లో వెయ్యి ఎకరాల అటవీ భూములను అటవీ శాఖకు కేటాయించినట్టు తెలిపారు. దీనికి ఫలితంగా ఆదివాసీ కొండరెడ్డి గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ.కోటి కేటాయిస్తామని నాడు అటవీశాఖ, రెవెన్యూ అధికారులు సింగరేణి సంస్థ ద్వారా ఇప్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేటికీ గిరిజన గ్రామాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. ప్రస్తుతం ఆ భూములను అటవీశాఖ ఆక్రమించుకునేందుకు గిరిజనులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. నాడు ఇచ్చిన హామీ ప్రకారం రూ.కోటి ఇచ్చేవిధంగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని కోరారు. గిరిజన సమస్యల పరిష్కార వేదిక ప్రతి బుధవారం నిర్వహించాలని అన్నారు. అనంతరం ఐటీడీఏలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధికారులకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొవ్వాసి గోవింద రాజు, మడకం వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కారం లక్ష్మి, మడి శ్రీరాములు, కెచ్చెల ముక్కారెడ్డి, కోర్సా గంగరాజు, ప్రజా సంఘాల నాయకులు నడపల ముక్కారెడ్డి, సద్గురు, కుర్సం లత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులు, వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న హెచ్‌ఎం సూర్యనారాయణ

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు కె.సూర్యనారాయణ సోమవారం తెలిపారు. ఇటీవల గణపవరంలోని బాలురు హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ (యస్‌జీఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు పొనుకు మాటి దివ్య, శ్రీగిరి రాధికలు విజయం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు నవంబర్ నెలలో కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడతారని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు గుడి సత్యనారాయణను, విద్యార్థినులను హెచ్‌ఎంతో పాటు, ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఎ.పోలవరంలో అధికారుల పల్లె నిద్ర



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సైలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని ఎ.పోలవరంలో పోలీస్ అధికారులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రజలకు సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ కృష్ణబాబు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకుల నుంచి పంపుతున్నట్టు మెసేజ్‌లు పంపడం, ఆధార్ కార్డు అప్డేట్ చేసుకోవాలని లింక్‌లను పంపడం చేస్తున్నారని వివరించారు. మొబైల్స్‌కి వచ్చే లింక్‌లను ఓపెన్ చేయకూడదని సూచించారు. బ్యాంకులు ఎటువంటి మెసేజ్‌లు ఖాతాదారులకు పంపవని చెప్పారు. ఎస్సై జబీర్ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్‌లకు మెసేజ్‌లు పంపితే వెంటనే సైబర్ నేరాలు అన్వేషించే 1930కి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆశవర్కర్ లక్ష్మీ మంగను విధుల్లోకి తీసుకోవాలి



టి.నరసాపురంసెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన ఆశ వర్కర్‌లు

టి.నరసాపురం: ఆశ వర్కర్ లక్ష్మీ మంగను తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పోసమ్మ డిమాండ్ చేశారు. లక్ష్మీ మంగను విధుల నుంచి తొలగించడానికి నిరసిస్తూ టి.నరసాపురం పీహెచ్‌సీ, ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం జిల్లాలోని పలు సీహెచ్ఎల్ పరిధిలోని ఆశ వర్కర్లు ఆందోళన చేశారు. టి.నరసాపురం ప్రధాన సెంటర్లో మానవహారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ మాట్లాడుతూ నాలుగు రోజులుగా ఆశ వర్కర్లు ఆందోళన నిర్వహిస్తున్నా అధికారుల్లో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గండిగూడెం ఆశ వర్కర్ లక్ష్మీ మంగను అదే గ్రామ సచివాలయం పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ నాగబాబు వేధింపులకు గురిచేసి మానసికంగా వేధిస్తున్నారని వివరించారు. సమస్యను వైద్యాధికారిణి కల్పనారాణి దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చేస్తున్నారని వాపోయారు. నాగబాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ మంగకు న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని జిల్లా స్థాయికి తీసుకువెళ్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో జిల్లాలోని పలు పీహెచ్‌సీలకు చెందిన ఆశ వర్కర్లు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.